www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 7 డిసెంబర్ 2023
5
అన్నమయ్య



రజి ఉద్దీన్ సాహెబ్‌కు ఉర్దూ అవార్డు



ప్రజాశక్తి-రాయచోటి టౌన్

20 సంవత్సరాల నుండి ఉర్దూ విద్యా సాహిత్య సాంస్కృతిక రంగాలకు విశిష్ట సేవలు అందిస్తున్నందుకు రజి ఉద్దీన్ సాహెబ్‌కు ప్రశ్నే ఉర్దూ అవార్డుకు ఎంపికయ్యారని సంస్థ కన్వీనర్ లియాఖత్ అలీ ఖాన్, సంస్థ కార్యదర్శి డాక్టర్ ఇమామ్ ఖాసిం సాబ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ప్రశ్నే ఉర్దూ అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఈ నెల 9వ తేదీ శనివారం అభినందన సభ ఏర్పాటు చేయడంతో పాటు సత్తార్ ఫైజి గజల్ పుస్తకం ఆవిష్కరణ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా రాయలసీమ ఉర్దూ రచయితల సమైక్య ప్రధాన కార్యదర్శి సత్తార్ ఫైజి, అబ్దుల్ రౌఫ్, మహమ్మద్ అలీ ఖాన్ జోహర్, మహమ్మద్ ఖలీల్ హుస్సేన్ జానీబ్ వస్తున్నారని చుట్టుపక్క ప్రాంతాల నుండి ప్రముఖ ఉర్దూ కవులు పాల్గొంటారని కావున ఉర్దూ సాహితీ ప్రియులు పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

పకడ్బందీగా పంట నష్టాల గణన : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి-రాయచోటి

మిచౌంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంట నష్టాల గణనను పకడ్బందీగా చేయాలని వ్యవసాయ, ఉద్యానవన అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. ముఖ్యమంత్రి సమీక్ష అనంతరం కలెక్టర్ గిరీష మాట్లాడుతూ రైల్వేకోడూరు డివిజన్‌లో అరటి తోటలకు సంబంధించి నష్ట వివరాలను త్వరగా లెక్కించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖకు సంబంధించి పెద్దగా నష్టం జరగలేదని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. జిల్లాలో దాదాపు 7 రహదారులు కొద్దిగా దెబ్బతిన్నాయని ఆర్‌అండ్‌బి ఎస్ఇ కలెక్టర్‌కు వివరించగా వాటిని త్వరితగతిన పునరుద్ధరించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ, పశుసంవర్ధక శాఖల అధికారులకు తగు సూచనలు చేశారు. జిల్లాలో మొత్తం 19 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లుగా ఆరోగ్యశాఖ అధికారులు వివరించారు, అంటువ్యాధులను అరికట్టేందుకు సరైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు తుపాను ప్రభావిత గ్రామాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మిగ్జామ్ తుపాను ప్రభావంపై అన్నమయ్య, నెల్లూరు, బాపట్ల, తదితర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ గిరీష, ఎస్‌పి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తుపాను బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించడం అనేది అన్నిటికంటే ముఖ్యమైనదని పేర్కొన్నారు. తుపాను బాధితులు కలెక్టర్లు మమ్మల్ని బాగా చూసుకున్నారు అని చెప్పగలిగినప్పుడే కలెక్టర్లు వారి బాధ్యతను పూర్తిగా నిర్వర్తించినట్లు అవుతుందన్నారు. వ్యవసాయ భూములు నీటితో నిండి ఉన్నందున ఆ నీటిని తీసివేసి ఆ వ్యవసాయ భూములను పునరుద్ధరించాలని ఆదేశించారు. రైతులకు కలెక్టర్లు పూర్తి భరోసా ఇవ్వాలని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని తెలపాలన్నారు. ప్రతి గ్రామంలో విద్యుత్తును పునరుద్ధరించాలని, రహదారులు ఎక్కడైనా పాడైపోతే వాటిని పునరుద్ధరించాలని ఆదేశించారు. తుపాను వల్ల పాక్షికంగా గాని పూర్తిగా గాని కూలిపోయిన ఇళ్లను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంటు వ్యాధులను అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎస్‌డిసి శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో నియోజక వర్గంలోని వ్యవసాయ శాఖ ఎడిఎలు, అన్ని మండలాల వ్యవసాయ శాఖాధికారులతోను, ఉద్యాన వనశాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు అందేలా చూడాలన్నారు. పంట నష్ట పరిహారాల నివేదికలను మండలాల వారీగా ఆయన ఆరా తీశారు. ఖరీఫ్‌లో ఈ క్రాప్ బుకింగ్ చేసుకుని పంట నష్టపోయిన ప్రతి రైతు వివరాలను ప్రభుత్వానికి నివేదించామని అధికారులు వివరించారు. ప్రస్తుత తుపాను ప్రభావంతో నియోజకవర్గ పరిధిలో పంటలు ఏమైనా దెబ్బతిన్నాయా అని అధికారులను ఎంఎల్ఎ అడగగా, సంబేపల్లె మండలంలో కొన్ని చోట్ల వరి ఇతర పంటలు దెబ్బతిన్నాయని అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యాన వన పంటల నష్టంపై ఆరా తీయగా కూరగాయల పంటలు టమోటా ఇతర పంటలు నష్టం జరిగిందని క్షేత్ర స్థాయిలో పర్యటించి వాటి నివేదికలను తయారు చేస్తున్నామని అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో 6 మండలాలకు గాను సంబేపల్లె మినహా ఐదు మండలాలు కరవు మండలాలుగా ప్రకటించారని, కరవు మండలాల వలె సంబేపల్లెకు కూడా ప్రయోజనాలు పొందేలా కృషి చేద్దామని ఆయన సూచించారు. రాయచోటి ఎడిఎ శ్రీలత, లక్కిరెడ్డిపల్లె ఎడిఎ జయరాణి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, కౌన్సిలర్ కొండేటి వెంకట నరసింహారెడ్డి, ఆరు మండలాల వ్యవసాయ అధికారులు, రెండు డివిజన్ల ఉద్యాన వన శాఖాధికారులు పాల్గొన్నారు.



రాయచోటి : పంట నష్టాలపై అధికారులతో సమీక్షిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రైతులకు సత్వర పరిహారం అందించాలి : 'మేడా'



రాజంపేట : నేలకొరిగిన అరటి తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి

రాజంపేట అర్బన్ : మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు సత్వరమే నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉద్యాన అధికారి సురేష్ బాబుతో కలిసి ఆయన మండలంలోని వరదయ్యగారిపల్లి, కారంపల్లి, హస్తవరం చేర్లోపల్లి, బ్రాహ్మణపల్లి, లింగరాజుపల్లి గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న అరటి తోటలను, పంటలను పరిశీలించారు. మండలంలోని 2000 ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయని ఉద్యాన, రెవెన్యూ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మండలంలో దాదాపు రూ.90 కోట్ల మేర రైతులు నష్టపోయినట్లు తెలిపిన ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి తెలిపారు. పంట నష్టాన్ని త్వరలో పూర్తి చేసి తుది నివేదికను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతాననని తెలిపారు. అన్నివిధాల నష్టపోయిన రైతన్నలకు ప్రభుత్వ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గంలో నష్టపోయిన ప్రతి రైతుకు వారి వారి పొలాల్లోని పంటలను పరిశీలించి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు త్వరిత గతిన పంపించి రైతులకు తక్షణమే న్యాయం చేయ వలసినదిగా సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి కె.పూర్ణ చంద్ర, హస్తవరం, పెద్దకారంపల్లి, వరదయ్యగారిపల్లి ఆర్‌బికె సిబ్బంది, విఆర్‌ఒలు, సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసి, రైతులు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీల ద్రోహి సిఎం జగన్ :'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

ముస్లిం, మైనార్టీల సంక్షేమం కోసం కేటాయించిన వేల కోట్ల రూపాయలు నిధులు దారి మళ్లించి రాష్ట్ర ముస్లిం, మైనారిటీలకు తీరని ద్రోహం చేసిన సిఎం జగన్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం పీలేరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనారిటీల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిశోర్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ముస్తాఖ్ అహ్మద్, అమీర్‌బాబు, గాజుల ఖాదర్‌బాష హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 80 మంది ముస్లిం మైనార్టీల కుటుంబాలపై దాడులు జరిగితే, ఆ దాడులు ఎందుకు జరిగాయి అంటూ అడగడానికి సమయంలేని ముఖ్యమంత్రి ఈ రాష్ట్రాన్ని పరిపాలన చేసే అర్హత కోల్పోయారని పేర్కొన్నారు. దైవదర్శనానికి హజ్ యాత్రకు వెళ్లే వారికి హజ్ హౌస్ లనిర్మాణం, వారికి సబ్సిడీలు, దుల్హన్ పథకం అందిస్తానని వాగ్దానం చేసిన జగన్‌రెడ్డి ముస్లింల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తూ నక్క వినయాలు వల్లిస్తూ ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న ముస్లిం మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం దృష్టిలో ఉంచుకుని మైనార్టీ కార్పొరేషన్ నుండి సబ్సిడీ రుణాలు, మహిళలకు కుట్టు మిషన్లు, దుకాన్-మకాన్ లాంటి సంక్షేమ పథకాలకు శ్రీకారంచుట్టి ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తింపు తీసుకోచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుదేనని పేర్కొన్నారు. 2024 తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్పొరేషన్‌కు నిధులు కేటాయింపు, వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణతో పాటు వక్ఫ్ బోర్డుకు జ్యుడీషియల్ అధికారం అందిస్తూ, విజయవాడ, కడప జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ హయాంలో ఏర్పాటు చేసిన హజ్ హౌస్‌ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, దుకాన్, మకాన్ లాంటి పథకాలకు పునరుద్ధరణ చేస్తూ, పేద ముస్లింలకు సబ్సిడీ రూపంలో ప్రభుత్వ ఖర్చుతో హజ్ యాత్రలకు అవకాశం కల్పిస్తూ ప్రత్యేక మ్యానిఫెస్టో ఏర్పాటు చేసి, అన్నిరకాలుగా మైనార్టీలకు చేయూతనిస్తూ, ఆర్థికంగా అదుకోవడమే తెలుగు దేశంపార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. పీలేరు నియోజకవర్గ పరిధిలో ఉన్న ముస్లిం, మైనార్టీలు నల్లారి కుటుంబంపై ఉన్న అభిమానం, అనుబంధం మరువలేనిదని, మా నాన్న కాలం నుండి కూడా మాకు అండగా, చేదోడు-వాదోడుగా ఉండి మా గెలుపుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వారి అభివృద్ధి కోసం మా కుటుంబం కట్టుబడి ఉందని కిషోర్ కుమార్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి డాక్టర్ మల్లెల రెడ్డి బాష, షౌకత్, బుజ్జు, చాను, ఫైరోజ్, మౌలా, ఇస్మాయిల్, నౌలాక్, ఖాజా, ఆర్షద్, మున్వర్, కలికిరి నిజాముద్దీన్, ఖాదర్ బాష, ముస్తఫా హాజరత్, గయాజుద్దీన్, షాబుద్దిన్, వాల్మీకి పురం సయ్యద్ బాష, గుర్రం కొండ నౌషాద్, ఇగ్బాల్, కలకడ జిలాని, ఇరాన్, జిరాక్స్ అలీ, కెవి పల్లి రెడ్డి బాష, ముస్లిం మైనారిటీలు, టిడిపి అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ఓటర్ల నమోదులో తప్పులకు ఆస్కారమివ్వొద్దు : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ఓటర్ల నమోదు ప్రక్రియలో తప్పులకు ఆస్కారమివ్వ రాదని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని విసి హాల్‌లో ఓటరు జాబితా సవరణపై ఆర్డీవోలు, తహశీల్దార్లతో సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడానికి సంబంధిత అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. జిల్లాలో వందశాతం తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు.ఆర్డీవోలు, తహశీల్దార్లు, బిఎల్వోలు ఫామ్-6 పెండెన్సీపై అత్యధిక ప్రాధాన్యత నిచ్చి పరిష్కరించాలన్నారు. బిఎల్ఓ లు ప్రొసీజర్ ప్రకారం క్లెయిమ్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లు ఫైల్ చేసుకుని రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం క్లెయిమ్స్ డిస్పోజల్ నాణ్యతగా చేపట్టాలని రాజకీయ పార్టీల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జంక్ క్యారెక్టర్స్, ఎక్కడైనా ఒకే డోర్ నెంబర్లో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని ఒకటికి రెండుసార్లు వెరిఫై చేసి జంక్ ఓటర్లను పక్కగా పరిశీలించాలన్నారు. భవిష్యత్తులో జింక్ క్యారెక్టర్స్ ఎక్కడ రాకుం డా చూడాలన్నారు. 18, 19 ఏళ్ల వయసు ఉన్న యువ ఓటర్లు మిస్ కాకుండా వీరిన మోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలనిన్నారు వార్డ్ అడ్మిన్ సెక్రటరీల సహాయంతో ఆయా సచివాలయాల పరిధిలో 18, 19 ఏళ్ల వయసున్న యువ ఓటర్లను గుర్తించి ఓటర్ లిస్ట్‌లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.22-ఏ నిషేధిత భూముల నుంచి తొలగించిన రైతుల దగ్గర తప్పకుండా ఇకెవైసి తీసుకొని వారికి సర్టిఫికెట్లు జారీ చేయాలని ఈ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సీరియస్‌గా తీసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష



డాక్టర్ రఘునాథరెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

గుండె సంబంధిత సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : గుండె సంబంధిత సమస్యలపై బోయినపల్లెలోని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల విద్యార్థులకు అవగాహన బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటీ అత్యవసర ఔషధ విభాగం హెచ్‌ఒడి డాక్టర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఎవరికైనా అనుకోని పరిస్థితుల్లో కార్డియాక్ అరెస్ట్ జరిగిన సమయంలో సిపిఆర్ ఎలా చేయాలో వివరించారు. ముందుగా రోగి యొక్క పల్స్ రేట్ పరీక్ష చేసి, ఆ తర్వాత సిపిఆర్‌ను మొదలుపెట్టాలన్నారు. ఛాతిపై ఒత్తిడిని ఎలా పెట్టాలో వివరించారు. ఈ సందర్భంలో 30 సార్లు ఛాతిపై నొక్కిన తర్వాత రెండుసార్లు ముక్కు ద్వారా శ్వాసను నోటితో ఒత్తిడిని తెస్తూ రోగికి అందించాలని తెలిపారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమానాదాలు ఇచ్చారు. వారి సందేహాలు కూడా పూర్తిగా వివరించారు. అనంతరం రఘునాథరెడ్డి ని కళాశాల యాజమాన్యం, ఆధ్యాపక బృందం జ్ఞాపిక అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చొప్పా గంగిరెడ్డి, కోశాధికారి అభిషేక్‌రెడ్డి, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత, డాక్టర్ డి.గిరాశేఖర్, డాక్టర్ ఎం.ప్రమోద్‌కుమార్, డాక్టర్ ఎం.శిరీష, డాక్టర్ ఎం.శ్రవణ్ కుమార్, డాక్టర్ హంసబేగ్, డాక్టర్ మణిదీప్, డాక్టర్ విలీన హాసిని, డాక్టర్ లీలామణి, ఇతర కళాశాలల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోజుకో నిరుద్యోగి ఆత్మహత్య

- టిడిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్ : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం నాలుగున్నర సంవత్సరాల పాటు ఎదురుచూసి ఒకవైపు వయస్సు పెరిగి, మరోవైపు కోచింగులు తీసుకోవడానికి డబ్బులు లేక, ఆర్థిక స్థితిగతులు సరిగా లేక యువత నిరాశలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని టిడిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, రెగ్యులర్ డిఎస్సీ నిర్వహిస్తామని, గ్రూప్-1, గ్రూప్-2 పోస్టు విడుదల చేస్తామని చెప్పి ఇంత వరకు వాటి ఊసే ఎత్తలేదని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో యువతకు ఉచిత కోచింగ్ ఇవ్వడం కోసం బిసి స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేశారని, వీటి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది యువత ఉచిత కోచింగ్ తీసుకుని మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన బిసి సామాజిక వర్గం ఆర్థిక స్థితిగతులు దారుణంగా ఉన్నాయని చెప్పారు. అలాంటి నేపథ్యంలో వేల రూపాయలు వెచ్చించి కోచింగ్‌లు తీసుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నా యువత అధికంగా బడుగు, బలహీన సామాజిక వర్గాల్లోనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1,345 మంది నిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్ప డ్డారంటే ఈ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల ప్రదర్శన ప్రదర్శిస్తున్న తీరుకు నిదర్శన మని తెలిపారు. సమావేశంలో టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ రెడ్డయ్య యాదవ్, జిల్లా నాయకులు మణికంఠ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని జిల్లా ఆర్ఐఒ రమణ రాజు అన్నారు. ఈ నెల 8వ తేదీ నుండి పదవ తేదీ వరకు విజయనగరం జిల్లాలో డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో జరగబోవు 10వ ఎపి ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్, క్యాడెట్ విభాగానికి గాను బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఐఒ రమణ రాజు పాల్గొని మాట్లాడుతూ క్రీడల వలన ఆరోగ్యంతో పాటు విద్య, ఉపాధి లోను మెరుగైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. జిల్లా పెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.చంద్రకళావతి మాట్లాడుతూ క్యాడెట్ బాలికల విభాగంలో ఈపి విభాగం నందు అర్మీన్, ఫాయిల్ బాలుర విభాగంలో జ్యోషిత్ రెడ్డి, అక్షిత రాయుడు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు విజయనగరం జిల్లాలో జరగబోవు ఎపి ఇంటర్ డిస్ట్రిక్ పోటీలలో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ మురళీకృష్ణారెడ్డి, అధ్యాపకులు రామాంజనేయులు, కోచ్ శ్రీను పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో అధ్యాపకులు

రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోంది : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని పోలీసు రాజ్యం నడుస్తున్నదని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ నేర గణాంక సంస్థ నివేదిక ప్రకారం 2022లో పోలీసుల ఆకృత్యాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలో 3 స్థానంలో ఉండగా దక్షిణాది రాష్ట్రాలలో 1వ స్థానంలో ఉందన్నారు. దేశంలో మహారాష్ట్ర 375 పోలీసుల ఆకృత్యాలతో 1 స్థానంలో, రాజస్థాన్ 227 ఆకృత్యాలతో 2వ స్థానంలో ఉండగా, 221 ఆకృత్యాలతో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో ఉందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి తమిళనాడులో 114, తెలంగాణలో 88, కేరళలో 101, కర్ణాటకలో 60 పోలీసుల ఆకృత్యాలు జరగగా ఆంధ్రప్రదేశ్‌లో 2021 జరగడం గమనార్హమన్నారు. తెలంగాణలో 6 గ్యారంటీలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చినట్లే ఆంధ్రప్రదేశ్‌లో 6 సూత్రాలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ రుణాలు మాఫీ, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా, ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.6 వేలు ఆర్థిక సహాయం, ప్రత్యేక హోదా అమలు, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి అమలు, కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విభజన చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ 6 సూత్రాలు ఆంధ్రప్రదేశ్‌లో అధికారానికి సోపానాలని చెప్పారు.

నేటి నుంచి 'మిట్స్'లో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురు, శుక్రవారాలలో రెండురోజుల పాటు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ ఫర్ లెర్నింగ్ సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. మెషిన్ లెర్నింగ్ డేటా సైన్స్‌లో పనిచేస్తున్న అకాడెమియా పరిశ్రమలకు చెందిన పరిశోధకులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలను వారి అప్లికేషన్‌లను ఒకచోట చేర్చడానికి ఒక ప్రధాన అంతర్జాతీయ సమావేశం కళాశాలలో జరుగుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వారి తాజా రచనలు, పరిశోధన ఫలితాలను ప్రదర్శించడానికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్-కంప్యూటింగ్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్, పర్సెప్షన్, కాగ్నిటివ్ సైన్స్, సైకాలజీ, డేటా అనాలిసిస్, ఐఒటికి సంబంధించిన వివిధ సబ్జెక్టులపై ప్రత్యేక సెషన్‌లు ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. తైవాన్‌లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, అకాడెమియా సినికా ప్రొఫెసర్ డాక్టర్ వెన్-లియాంగ్ హ్వాంగ్, జర్మనీ లోని ఈస్ట్‌బవేరియన్ టెక్నికల్ యూనివర్శిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అంబర్గ్‌వైడెన్, ఎలక్ట్రికల్ విభాగం ఇంజినీరింగ్, మీడియా కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ టట్యానా ఇవనోవ్నా , జపాన్‌లోని గకుషుయిన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ యుకారి శిరోటా, క్యాంపస్ హాగెన్‌బర్గ్‌లోని యూనివర్శిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అప్పర్ ఆస్ట్రియా ప్రొఫెసర్ డాక్టర్ పీటర్ బర్గ్‌స్టాలర్, స్విట్జర్లాండ్‌లోని విశ్వవిద్యాలయం అప్లైడ్ సైన్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ సెడ్రిక్ బోర్నాండ్ యుఎస్ లోని యూనివర్శిటీ ఆఫ్ మెంఫిస్ గణితశాస్త్ర ప్రొఫెసర్ రాబర్ట్ కోజ్మాలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా పాల్గొంటున్నారని తెలిపారు.

వైసిపి మండల ఉపాధ్యక్షులుగా సంజీవయ్య



ప్రజాశక్తి-పీలేరు : వైసిపి మండల ఉపాధ్యక్షులుగా ఎస్ఎల్‌వి సంజీవయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పీలేరు పట్టణానికి చెందిన తాను కొన్నేళ్లుగా వైసిపి అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి పార్టీ అధిష్టానం తనకు ఈ పదవిని కేటాయించిందన్నారు. పార్టీ బలోపేతానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి, వైసిపి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్ నాయక్

దృష్టిలోప నివారణకు విటమిన్ 'ఎ' అవసరం

ప్రజాశక్తి-పీలేరు

చక్కటి దృష్టి, మంచి ఆరోగ్యం మీబిడ్డ హక్కు అని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తల్లులకు తెలిపారు. బుధవారం పీలేరు మండలం కావలిపల్లి హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లో నిర్వహించిన శిశువులకు-విటమిన్ 'ఎ' ద్రావణం ఆవశ్యకతా అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జ్ఞానేంద్రియాల్లో కళ్లు అతి విలువైనవని తెలిపారు. మీ బిడ్డ చక్కటి కంటి చూపు కోసం విటమిన్ 'ఎ' సమృద్ధిగా ఉండే అదనపు ఆహారాన్ని ఆరవ నెల నుంచే ఇవ్వాలన్నారు. లేదంటే విటమిన్ 'ఎ' లోపంతో పిల్లలు దృష్టి లోపానికి లోనయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ లోపం నిర్మూలనకు ప్రభుత్వం ఉచితంగా విటమిన్ 'ఎ' ద్రావణాన్ని పది నెలల వయస్సు బిడ్డ నుండి ప్రతి అరు నెలలకు ఒకసారి, ఐదు సంవత్సరాల వరకు వేయించడంతో పాటు, విటమిన్ 'ఎ' లభ్యమయ్యే వెన్న, నెయ్యి, గుడ్లు, కాలేయం, చేపలు, తాజా ముదురు ఆకుపచ్చ రంగు ఆకు కూరలు, మామిడి, బొప్పాయి, క్యారెట్, గుమ్మడి, మొదలగు ఆహార పదార్థాలు ఆహారంలో తీసుకోవాలని చెప్పారు. ప్రతి బిడ్డ ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, యంపిహెచ్ఇఒ శ్రీను, పంచాయతీ కార్యదర్శి నవీన్, ఎఎన్ఎం .లక్ష్మి, సిహెచ్ఒ సౌజన్య, ఆశ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-కలికిరి : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ప్రతి బాల్యవివాహాలపై ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏరియా కో-ఆర్డినేటర్ రూతు అన్నారు. స్థానిక మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో వెలుగు కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థినిలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ప్రతి ఒక్కరూ ఉన్నత చదు వులపై లక్ష్యముంచి మంచి భవిష్యత్తును ఏర్పరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహన ముఖ్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : ప్రతి ఓటర్‌కు ఇవిఎం యంత్రాలపై అవగాహన ముఖ్యమని అప్పుడే ఓటును సులభంగా వేయగలమని సెక్టోరల్ ఆఫీసర్ అశోక్, తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం తంబళ్లపల్లి జూనియర్ కళాశాలలో ఓటర్లకు ఇవిఎం యంత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విఆర్ఒ వెంకట్రమణ పంచాయతీ సెక్రటరీ సోమశేఖర్ ఇవిఎంల వినియోగం, ఓటర్లు ఓటు వేసే తీరుపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిఎల్ఒలు సందీప్, త్రినేని, శేషాద్రి, విఆర్ఎ సురేష్, వెంకటరమణ, ప్రసాద్, ఓటర్లు పాల్గొన్నారు.


సాగులో ఉన్న పంటను పరిశీలిస్తున్న పాండురంగ

దెబ్బతిన్న పంటల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

మిచౌంగ్ తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటలు పై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అన్ని రకాల పంటలకు నష్టం జరిగిందని, రైతులు తప్పక కొన్ని సూచనలు పాటించి పంట నష్టాన్ని నివారించుకోవాలని కోరారు. అన్ని పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు బయటకు పంపే ఏర్పాట్లు చెయ్యాలని, పిలకలు తొడిగే దశ లో వున్న వరి పైరు కు ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పోటాష్ ఎరువులను అందించాలని సూచించారు. మామిడి లో వర్షాలు ఆగిన తరువాత తోటలో తేలికగా దున్ని, భూమిలో తేమ ఆరేటట్లు చేస్తే పూత వస్తుందని తెలిపారు. వ్యాధికారుల సూచనల మేరకు ఎరువులు, మందులు వాడితే పంటలను పరిరక్షించుకోవచ్చని తెలిపారు.

కూలీల సంఖ్య పెంచండి

ప్రజాశక్తి-గాలివీడు

ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్యను పెంచాలని ఎపిడి రెడ్డయ్యరాజు పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ సభాభవనంలో ఎంపిడిఒ శేఖర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందరోజులు పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని సూచించారు. హౌసింగ్ బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు సరిచసు కోవాలని తెలిపారు కార్యక్రమంలో ఎపిఒ వై.హరిప్రసాద్, పి.రామచంద్ర, టిఎలు, ఎఫ్‌ఎలు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌ఒగా ప్రశాంత్

ప్రజాశక్తి-బి.కొత్తకోట


జి.ఎస్.ప్రశాంత్

బి.కొత్తకోట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒగా జి.ఎస్.ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బి.కొత్తకోట పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రామ్మోహన్ గుడిపాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సిఐ స్థాయి అధికారిని నియమించాల్సి ఉండగా డిఎస్‌పి శిక్షణ పూర్తి చేసుకున్న జి.ఎస్.ప్రశాంత్‌ను ప్రభుత్వం ఎస్‌హెచ్‌ఒగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తామని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. పట్టణం కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉండటంవల్ల ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అక్రమమద్యం రవాణా, నాటుసారా తయారీ, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.

శుభ్రత పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠశాలలో పరిశుభ్రత కోసం శుభ్రత చేసే పరికరాలను బుధవారం మండల ఎఇఒలు రామకృష్ణుడు, జయచంద్ర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వర్షాలు పడు తున్న సందర్భంగా పాఠశాలలో గదులను శుభ్రం చేసేందుకు పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్లు శుభ్రత కోసం బ్లీచింగ్‌పౌడర్, యాసిడ్‌ను ఆయా పాఠశాలలకు అందించామని తెలిపారు. కస్తూర్బా బాలి కల పాఠశాల, ఆదర్శపాఠశాల, అంబేద్కర్‌పాఠశాల సిబ్బందికి అందించినట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.


ఎస్ఐని సన్మానిస్తున్న ఖలీల్‌అహ్మద్

ఎస్ఐ రామ్మోహన్‌కు సన్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట ఎస్ఐగా పనిచేస్తూ గుడిపాలకు బదిలీ అయిన ఎస్ఐ రామ్మోహన్‌ను వైసిపి పలమనేరు నియోజకవర్గ పరిశీలికులు, జిల్లా ఉపాధ్యక్షులు పి.ఖలీల్‌అహ్మద్ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్ఐ సేవలు అభినంద నీయ మని కొనియాడారు. నగర పంచాయతీ కమిషనర్ పిఆర్ మనోహర్, నగర పంచా యతీ అధికారులు, మండల వైసిపి నాయకులు ,ప్రజాప్రతినిధులు అందరితో కలిసి విందు భోజనం చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సిఆర్ చిన్నికృష్ణ, రాయల్‌సలీం, రెడ్డిఈశ్వర్ రెడ్డి, సాయిరాం, అయుబ్‌బాషా, నరసింహ నాయుడు, నక్కా సంతోష్, బసిరెడ్డి, సద్దాం, కంచి బలరాంరెడ్డి పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి : ఎపిఎం

ప్రజాశక్తి - తంబళ్లపల్లి

మండలంలోని వైఎస్ఆర్ క్రాంతి పథం మహిళా సంఘం సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించే విధంగా సంఘమిత్రలు కృషి చేయాలని ఎపిఎం గంగాధర్ తెలిపారు. బుధవారం శ్రీశక్తి భవన్‌లో సంఘమిత్రలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి, విఒ, మండల సమైక్యల నుంచి తీసుకున్న రుణాలను సభ్యులు సక్రమంగా చెల్లించినప్పుడే ఇతరులకు రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో మండల సమైక్య అధ్యక్షురాలు కుమారమ్మ, సిసిలు ఆదిలక్ష్మి, హసీరాబేగం పాల్గొన్నారు.

విద్యార్థులకు తిథి భోజనం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం సిద్ధ రాజారెడ్డి భార్య మాజీ జడ్‌పిటిసి సిద్ధ వెంకటసుబ్బమ్మ మనవురాలైన సిద్ధ కీర్తిక జన్మదిన సందర్భంగా పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ మనవరాలు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. జన్మదిన వేడుకలు పాఠశాలలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని అదేవిధంగా విద్యార్థులకు తిథి భోజనం అందించడం కూడా సంప్ర దాయంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడప అర్బన్


జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీలలో నగరంలోని జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచారని క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు లక్ష్మి, ఎనిమిదవ తరగతి విద్యార్థి జోషిక మొదటి స్థానం నుంచి బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటసుబ్బమ్మ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేద్కర్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 67వ వర్ధంతిని వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. రాయచోటి పట్టణంలోని మాసాపేటలోని అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్. స్థానిక కౌన్సిలర్లు, వైఎస్ఆర్ సిపి నాయకులతో కలసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జోహార్ అంబేద్కర్ అంటూ పెద్దఎత్తున నినదించారు. దేశానికి వారు చేసిన సేవలను వైఎస్ఆర్ సిపి నాయకులు గుర్తు చేసుకున్నారు. భారతజాతిని జాగృత పరిచిన ఆదర్శమూర్తి ప్రపంచ మేధావి బిఆర్.అంబేద్కర్ అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, న్యాయశాస్త్ర నిపుణుడు, ఆర్థిక వేత్త, సామాజిక శాస్త్రజ్ఞుడు,చరిత్ర కారుడు,రాజనీతి కోవిదుడుగా అంబేద్కర్ పేరు ప్రఖ్యాతులు పొందారన్నారు.ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచి, వారి ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే వారికి నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామని అన్నారు. **నందలూరు:** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ బస్టాండ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్‌కమిటీ సభ్యులు పెనుబాల నాగసబ్బయ్య, జిల్లావక్ఫ్ బోర్డ్ కార్యదర్శి సయ్యద్ అమీర్, మోడపోతుల రాము, అర్ముగం విశ్వనాథ్, కాకి చంద్ర, నాగభూషణం, బొమ్మి మధు, తుమ్మది శివ, ఎజిపి సమీవుల్లా, మోహన్‌రెడ్డి, ఎంపిటిసి గునాయదవ్, శివ నరసింహులు, శివరాం పాల్గొన్నారు. **మదనపల్లి :** భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలోఆర్‌డిఒ ఎంఎస్ మురళి, సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన రచించిన రాజ్యాంగం వల్ల అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛ వాయువును పీల్చుకోగలుగుతున్నామని అన్నారు. కార్యక్రమంలో డిఎఒ శేషయ్య, గురు ప్రసాద్, పద్మనాభం పాల్గొన్నారు. **విసికె పార్టీ ఆధ్వర్యంలో..** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 67 వ వర్ధంతిని కుల నిర్మూలనా పోరాట అమర వీరుల దినంగా విసికె పార్టీ, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) సంయుక్తంగా జరుపుకున్నారు. స్థానిక బెంగళూరు రోడ్డు నందలి న్యూ అంబేద్కర్ సర్కిల్ వద్ద విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ అధ్యక్షన జరిగిన కార్యక్రమానికి విజయభారతి హైస్కూల్ కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భారతదేశ సర్వతోముఖాభివృద్ధికి బహుముఖ సేవలందించిన గొప్ప దేశభక్తుడు అంబేద్కర్ అని కొని యాడారు. కార్యక్రమంలో విసికె, బాస్ నాయకులు బురుజు లక్ష్మీనా రాయణ, మునివెంకటప్ప, నీరుగట్టి రమణ, పీర్‌బాషా, పి. రవిశంకర్‌లు పాల్గొన్నారు. **బహుజనసేన ఆధ్వర్యంలో..** బహుజనసేన ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఓబులేసుచ బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు అన్న, చందు, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శీనన్న, హెల్పింగ్ మైండ్స్ అబూ అమీన్ బహుజన సేన మైనారిటీ నాయకులు నూర్‌అలాల్, బిసి నాయకులు పాల్గొన్నారు. **సుండుపల్లి:** అంబేద్కర్ విగ్రహానికి పలువురు ప్రజా సంఘాల నాయకులు మాలమహానాడు రాష్ట్ర నాయకులు కె.వి రమణయ్య , దళిత నాయకులు, జనసేన నాయకురాలు,


రాయచోటి :అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైసిపి నాయకులు


పీలేరు : అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు

రెడ్డిరాణిలు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. **పీలేరు:** పీలేరు పంచాయతీ కార్యాలయ సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహానికి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు .కార్యక్రమంలో మాల మహనాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, భారతీయ అంబేద్కర్‌సేన జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, ముస్లిం జెఎసి నాయకులు షేక్‌అమీరుల్లా పేర్కొన్నారు. కార్యక్రమంలో మాలమహనాడు రాయలసీమ జిల్లాల సహయ కార్యదర్శి **ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..** అంబేద్కర్ 67వ వర్ధంతిని ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. పీలేరు పంచాయతీ సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రామాచారి, విహెచ్ పిఎస్ నాయకులు భాస్కర, ఎంఆర్‌పిఎస్ పీలేరు ఇన్‌ఛార్జి చరణ్ కుమార్, కెవిపల్లి ఎంఆర్‌పిఎస్ నాయకులు రాజేష్, ప్రణీత్, ఎంఎస్‌పి యశస్విని పాల్గొన్నారు.నగరిమడుగు సుభాష్, జెట్టి మల్లికార్జున, సీనియర్ నాయకులు కె.గట్టప్ప, రామాపురపు ద్వారాకనాథ్, బాస్ జిల్లా నాయకులు ముల్లంగి క్రిష్ణయ్య పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** నిమ్మనపల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, మునిరత్నం స్థానిక దళిత సంఘ నాయకులు ప్రజా సేవాసంస్థ అధ్యక్షులు సహదేవ, జయన్న, చంద్రాయుడు,తవళం సర్పంచ్ రెడ్డప్ప, ముబారక్‌లతో కలిసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచ మేధవి అన్నారు. దళిత కులంలో జన్మించిన జాతి రత్నమని, ఎంతో ముందు చూపుతో ఆయన రాసిన రాజ్యాంగం భారత దేశానికి దిశా, దశ నిర్దేశంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, మునిరత్నం, దళిత సంఘ నాయ కులు పాల్గొన్నారు. **కలికిరి:** స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎస్‌సి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రవీంద్ర, జయరాం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాల అభివృద్ధి కోసం, దేశ అభివృద్ధి కోసం రాజ్యాంగాన్ని రచించి రిజర్వేషన్లు ఏర్పాటుచేసి పేద,బడుగు, బలహీన వర్గాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. కార్యక్రమంలో అగస్తీశ్వర, శ్రీనివాస వర్మ, సిద్దయ్య, శ్రీనివాసులు, అశోక్, రమణ, యేసురాజు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి నాయకులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :**తహసిల్దార్ కార్యాల యంలో తహశీల్దార్ రఫీక్ అహ్మద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కార్యదర్శి సింగన్న, డిటి అన్సారి, విఆర్‌ఒ సోమశేఖర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతిని నియోజక నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోసాలదేవి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్‌సి సెల్ కన్వీనర్ శాంతయ్య, జిల్లా నాయకులు కె.వి ప్రతాప్ రెడ్డి, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు పెంచలయ్య, కొరముట్ల రాము, మండల అధ్యక్షుడు సిగమాల రమేష్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** స్థానిక వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్ వెంకటరామయ్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు భాస్కర్, మల్లికార్జున,జగదీష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పిఒఆర్‌డి, సిబ్బంది రెడ్డమ్మ, అనిత, భువనేశ్వరి ,మధుబాల ,పివి రమణ పాల్గొన్నారు.

వందలాది ఎకరాల్లో నేలకొరిగిన అరటి


రైల్వేకోడూరు : నేలకొరిగిన అరటి పంట

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలో గత మూడు రోజులుగా మిచౌంగ్ తుపాన్ కారణంగా 469 మంది రైతులకు చెందిన 839 ఎకరాలలో అరటి పంట నేలకొరిగింది. అనంతరాజుపేట-1 పరిధిలో 23 మంది రైతులకు చెందిన 45 ఎకరాలలు, బొజ్జ వారిపల్లెలో ముగ్గురు రైతులకు చెందిన మూడు ఎకరాలలో,అనంతరాజుపేట-2 పరిధిలో ముగ్గురు రైతులకు చెందిన నాలుగు ఎకరాలలో, ఉర్లగట్టుపోడులో 25 మంది రైతులకు చెందిన 60 ఎకరాలలో, రాఘవరాజుపురంలో 45 మందికి చెందిన 61 ఎకరాలలో, విపిఆర్ కండ్రికలో 180 మంది రైతులకు చెందిన 260 ఎకరాలలో, గంగరాజుపోడులో 21 రైతులకు చెందిన 40 ఎకరాలలో, ఉప్పరపల్లెలో 55 మంది రైతులకు చెందిన 110 ఎకరాలలో అరటి నేలకూలింది. యానాదిపల్లెలో ఆరుమంది రైతులకు చెందిన 15 ఎకరాలలో, శెట్టిగుంటలో ఇద్దరు రైతులకు చెందిన రెండు ఎకరాలలో, వెంకటరెడ్డిపల్లెలో 20 మంది రైతులకు చెందిన 59 ఎకరాలలో, మైసూర్‌వారిపల్లెకు చెందిన నలుగురు రైతులకు చెందిన ఆరు ఎకరాలలో, ఓబనపల్లె 1,2లో 18 మంది రైతులకు చెందిన 30 ఎకరాలలో, రెడ్డివారిపల్లెలో 16 మంది రైతులకు చెందిన 22 ఎకరాలలో,16 మంది రైతులకు చెందిన 27 ఎకరాలలో రైతులు నష్టపోయారు. వివికండ్రికలో 12 మంది రైతులకు చెందిన 15 ఎకరాలలో,అరటిపంట నేలకొరిగింది. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగుచేసి తీరా పంట కోతకు వచ్చే సమయానికి తుపాను కారణంగా పంట నష్టపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం నామమాత్రంగా పంట నష్టపరిహారం అందిస్తుందని ఇది ఏ మూలకు చాలాదని పంట నష్టపరిహారం పెంచి ఆదుకోవాలని, లేకుంటే ఆత్మహత్యలు శరణ్యమని రైతులు వాపోతున్నారు.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలి : టిడిపి

నిమ్మనపల్లి : మిచౌంగ్ తుఫాను బాధిత రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మదనపల్లి మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ముష్టూరు గ్రామంలో స్థానిక టిడిపి నాయకులతో కలిసి మిచౌంగ్ తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను పరామర్శించి, క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో మండలంలో చాలామంది రైతులు చేతికొచ్చిన వ్యవసాయ, ఉద్యానవన పంటలను నష్టపోయారని, వారికి పరిహారం చెల్లించి ప్రభుత్వం వెంటనే వారిని ఆదుకోవాలని అన్నారు. నిమ్మనపల్లి మండలంలో కోత దశలోని వరి పంటలు పూర్తిగా నీట మునిగాయని, కొన్ని ప్రాంతాలలో పొలంలోనే వరి పంటలు మొలకలు వచ్చాయని అన్నారు. మండలంలో ఇంతవరకు ఎన్ని ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందో వ్యవసాయ అధికారులు ప్రకటించకపోవడం, సచివాలయ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని గుర్తించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని తెలిపారు. తుఫాను ప్రభావంతో పంటలను నష్టపోయిన రైతులకు టిడిపి అండగా ఉంటుందని, వారికి నష్టపరిహారం వచ్చేవరకు పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, తెలుగు యువత మండలాధ్యక్షులు చిన్నబాబు, నాయకులు రెడ్డప్పరెడ్డి, మునిరత్నం, సుధాకర్‌రావు, మల్లికార్జున, శ్రీనివాసులు, లక్ష్మన్న, విజయ్, మురళీమోహన్, శంకర, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


వలసపల్లిలో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న దొమ్మలపాటి టిడిపి నాయకులు

నారా లోకేష్‌ను కలిసిన జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌ను కలిసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. గత నాలుగైదు సంవత్సరాలుగా తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన వివరించానని తెలిపారు. ధార్మిక కార్యక్రమాలకు విరాళాలు, ఆపన్నులకు ఆర్థికంగా, విద్య, వైద్య ఖర్చులకు ఆర్థికంగా తన వంతు సహకారం అందజేస్తూ ప్రజలతో మమేకమవు తున్నాని చెప్పారు. మొరుసు కాపురెడ్డి ఒక్కలిగ సామాజిక వర్గానికి చెందిన తనను ప్రాధాన్యమివ్వాలని కోరినట్లు చెప్పారు. టిడిపి కేడర్‌ను కలుపుకొని నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేసేందుకు సిద్దంగా ఉన్నామని వివరించినట్లు తెలిపారు. లోకేష్ కూడా శ్రద్ధగా విని సానుకూలంగా స్పందించారని చెప్పారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబును కూడా గతంలో కలిసినట్లు చెప్పారు. ఆయన కూడా తన అభ్యర్థిత్వంపై సానుకూలంగా స్పందించారని అన్నారు. నాపై నమ్మకం ఉంచి తన అభ్యర్థిత్వాన్ని


లోకేష్‌కు పూలబొకే అందిస్తున్న జయచంద్రారెడ్డి

ఖరారు చేస్తే పార్టీ కోసం శాయశక్తుల పనిచేస్తానని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును మరల ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని వర్గాలను కలుకొని టిడిపి గెలుపుకు కృషి చేస్తామని చెప్పారు.


జాబ్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

రైతులకు లబ్ధి చేకూర్చడం హర్షణీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ములకలచేరువు

నియోజకవర్గంలోని ఆరు మండలాలలోని ప్రతి రైతుకు ఉపాధిహామీ ద్వారా లబ్ధి జరిగే పనులు చేపట్టడంపై ఎపిడి మధుబాబు ఇచ్చిన సూచన బాగున్నాయని ప్రశంసించారు. బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఏపీడి మధుబాబుతో సమీక్ష జరిపి ఉపాధి హామీ పనుల ద్వారా స్థానిక రైతులకు వ్యవసాయ పొలాల వద్ద నీటి ప్రవాహ కాలువల నిర్మాణం, భూగర్భ జలాలు పెంపొందడానికి ఇంకుడు గుంతలు, పురాతన వ్యవసాయ బావుల పునర్నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలలో మొక్కల పెంపకంతో పాటు సంరక్షణ చర్యలు చేపట్టడం హర్షణీయమని అన్నారు. ముఖ్యంగా 35 రకాల పండ్ల తోటలు పెంపకంతో పాటు రైతులకు ఏ రకమైన మొక్కలు పెంచుకోవడానికి అనుమతినిచ్చి ఉపాధిహామీ పనులు చారిత్రా త్మకంగా నిలవాలని సూచించారు. తంబళ్లపల్లి నియోజకవర్గం కరువు ప్రాంతంగా ప్రకటించడంతో స్థానిక కూలీలు వలసలు వెళ్లకుండా పూర్తిస్థాయిలో పని కల్పించి రైతులకు, భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే పనులు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉపాధిహామీ జాబ్ కేలం డర్‌ను ఆవిష్కరించారు. ఆయన వెంట ఉపాధి హామీ అధికారులు, రైతులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డి గెలుపుపై వైసిపిలో ఉలికెందుకు?

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి రేవంత్‌రెడ్డి గెలుపుపై వైసిపి నాయకులకు ఉలిక్కిపాటు ఎందుకని మాజీ ఎంపిపి ఉమాపతిరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి శంకరపుజయరాం పేర్కొన్నారు. బుధవారం రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి నివాసంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మాదిరిగానే ఎపిలో కూడా టిడిపి అధికారంలోకి వస్తుందని అన్నారు. ఒక్క ఛాన్స్ అని ప్రజలను మోసం చేసి గెలిచిన జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో వైసిపికి ఓటమి తప్పదన్నారు కార్యక్రమంలో బడుగు వాసుదేవుడు, సిద్ధగా వెంకటరామిరెడ్డి, అజంతుల్లా, వాసుదేవుడు దేవనాథరెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు


వర్షపునీటితో నిండిన చెరవుబండ వీధి

మడుగును తలపిస్తున్న వీధి

ప్రజాశక్తి-కలకడ

గత రెండురోజులుగా కురిసిన వర్షానికి కలకడలోని చెరువుబండవీధి మడుగును తలపిస్తోంది. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాల బారిన పడతామని ఆందోళన చెందుతున్నారు. కొద్దిపాటి వర్షం పడిన వర్షపు నీదంతా అక్కడికి చేరి మడుగులా మారిందన్నారు. కొంతమంది వర్షపు నీటిని మురికి నీటిని దిగువ ప్రాంతాలకు వెళ్ళనేకుండా అడ్డు వేయడంతో ఇలా జరుగుతుండదని పలువురు వాపోతున్నారు. అనేకసార్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపిన పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీటిని అక్కడ నిలవకుండా చూడవలసిన బాధ్యత ఎంతైనా ఉందని స్థానికులు వాపోతున్నారు.

ఓటు నమోదు సకాలంలో పూర్తి చేయండి

ప్రజాశక్తి-పెద్దమండ్యం : కొత్త ఓటర్ల నమోదుకు సకాలం పూర్తి చేయాలని తంబళ్లపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటనింగ్ అధికారి ఎస్.రాఘవేంద్ర పేర్కొన్నారు. బుధ వారం స్థానిక ఎంపిడిఒ కార్యక్రమంలో ఓటు నమోదు కార్యక్రమం పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. ఈనె 24న ప్రతి బూత్‌లో ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్న ట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాము, డిటి. రవినాయిక్, సూపర్వైజర్ గౌరీశంకర్, రమేష్, హసీనాతాజ్, విఆర్‌ఒలు నవాజ్, శ్రీరాములు, శ్రీనివాస నాయుడు, నీలిమ రెడ్డేప్ప పాల్గొన్నారు.

నేడు శ్రీవారి కల్యాణం, అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ : పట్టణంలోని వెంకటరమణ స్వామి ఆలయంలో ఈనెల 2 నుంచి ప్రారంభమైన అష్ట బంధన కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా ఐదు రోజులపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం స్వామివారికి కల్యాణోత్సవం, అనంతరం దాదాపు పదివేల మందికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు తుమ్మలపల్లె గ్రామానికి చెందిన బివిఎస్‌ఆర్ లారీ ట్రాన్స్‌పోర్ట్, భారతి సిమెంట్ కాంట్రాక్టర్ బివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని చుట్టుపక్కల గ్రామాల పరిధిలోని ప్రజలందరూ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సుబ్బారెడ్డి కోరారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి అంజనీ ప్రియదర్శిని అన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈనెల తొమ్మిదవ తేదీన రైల్వేకోడూరు పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందని రైల్వే కోడూరు, ఓబులవారిపల్లె మండలాలకు చెందిన కక్షిదారులు వివిధ కారణాలతో చిన్న చిన్న తగాదాలతో గొడవలు పడి ఒకరిపై ఒకరు నమోదు చేసుకున్న రాజీ కాదగినటువంటి సివిల్, క్రిమినల్ కేసులు ఉన్నవారు ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో వారి కేసులను పరిష్క రించుకోవచ్చునని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. **కలకడ :** లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ తిప్పేస్వామి సూచించారు. మండలంలోని వివిధ రకాలైన కేసులలో విరోధులుగా ఉన్నవారు రాజీ పడటానికి ఈనెల 9వ తేదీన లోక్‌అదాలత్ ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. మండలంలో సుమారు 62 కేసులు ఉన్నా యని వాటిని లోక్ అదాలత్ కార్యక్రమంలో ద్వారా రాజీ పడడానికి ఇరువర్గాలను పిలిఎంచినట్లు తెలిపారు. ఐదు కేసులు రాజీ పడడానికి ఇరువర్గాలు ఒప్పుకోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.విరోధాలతో కక్షలు, కార్పన్యాలు ఎక్కువ కావడం జరుగుతుందని రాజీపడడంతో మనశ్శాంతి ఇతరులకు ఆదర్శంగా ఉండేందుకు దోహదపడడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేసులు రాజీ పడేం దుకు వచ్చిన ఇరవర్గ సభ్యులు పాల్గొన్నారు.


కలకడ : కక్షిదారులకు లోక్‌అదాలత్ గురించి వివరిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి